

## నెక్లెస్@500 కోట్లు!

అంబానీ ఇంట పెళ్లి అంటే మాటలా.. ముఖేశ్ అంబానీ కొడుకు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ ప్రీ-వెడ్డింగ్ కార్యక్రమంలో ముఖేశ్ భార్య నీతా అంబానీ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఆమె ధరించిన ఎమరాల్డ్-డైమండ్ నెక్లెస్ ధర ఏకంగా రూ.500 కోట్లు. ఇక చెవిదుద్దులు, చేతి ఉంగరాలు, ఇతర ఆభరణాలు అదనం.

# జూన్ 30 వరకు గడువు ఇవ్వండి

## ఎలక్టోరల్ బాండ్ల వివరాల సమర్పణపై సుప్రీంకోర్టును కోరిన ఎస్బీఐ

న్యూఢిల్లీ, మార్చి 4: ఎన్నికల బాండ్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించేందుకు జూన్ 30 వరకు గడువు ఇవ్వాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) సుప్రీంకోర్టును కోరింది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానానికి తాజాగా అప్లికేషన్ పెట్టుకొన్నది. 2019, ఏప్రిల్ 12 నుంచి 2024, ఫిబ్రవరి 15 వరకు రాజకీయ పార్టీలకు విరాళాల కోసం 22,217 ఎలక్టోరల్ బాండ్లు జారీ చేశామని, వాటికి సంబంధించిన వివరాలు సమర్పించేందుకు సుప్రీంకోర్టు పెట్టిన మూడు వారాల గడువు సమయం సరిపోదని ఎస్బీఐ కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఎలక్టోరల్ బాండ్ల జారీ ప్రతి దశ ముగింపులో రిడీమ్ అయిన బాండ్లను అధీకృత బ్రాంచ్‌లు ముంబైలోని ప్రధాన బ్రాంచ్‌లో డిపాజిట్ చేశామని పేర్కొన్నది. రెండు వేర్వేరు సమాచారాలు ఉన్నందున, మొత్తంగా 44,434 సమాచార సెట్లను డీకోడ్ చేసి, సరిపోల్చాల్సి ఉంటుందని తెలిపింది. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఆ పథకాన్ని గత నెల 15న కొట్టివేసిన విషయం తెలిసిందే. ఎన్నికల బాండ్ల జారీని ఎస్బీఐ వెంటనే నిలిపివేయాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఆదేశించింది. అదేవిధంగా 2019, ఏప్రిల్ 12 నుంచి రాజకీయ పార్టీలకు వచ్చిన ఎన్నికల బాండ్ల అన్ని వివరాలను (కొనుగోలు చేసినవారు, కొనుగోలు తేదీ, ఎంత మొత్తం కొనుగోలు చేశారు) మార్చి 6వ తేదీలోగా ఎస్బీఐ.. ఈసీకి సమర్పించాలని, మార్చి 13లోగా ఆ వివరాలను వెబ్‌సైట్‌లో ఈసీ ప్రచురించాలని ఆదేశాలు ఇచ్చింది. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ అమలు సమాచార హక్కు ఉల్లంఘన అవుతుందని, క్విడ్ ప్రోకోకు దారితీసే ప్రమాదమూ ఉన్నదని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. నల్లధనాన్ని కట్టడికి ఇదొక్కటే మార్గం కాదని అభిప్రాయపడింది.




### ఎన్నికలయ్యే వరకు ఎందుకు?

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఈసీ సమర్పించేందుకు గడువు పొడిగించాలని కోరుతూ ఎస్బీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని విపక్ష నేతలు వ్యతిరేకించారు. ఇది ప్రధాని మోదీ 'నిజ రూపాన్ని' దాచేందుకు లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రభుత్వం చేస్తున్న చివరి ప్రయత్నమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. 'విరాళాల వ్యాపారాన్ని' దాచిపెట్టేందుకు మోదీ తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని రాహుల్ తన ఎక్స్ పోస్టులో ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను తెలుసుకోవడం ప్రజల హక్కు అని సుప్రీంకోర్టు పేర్కొన్నదని, అయితే ఎన్నికలకు ముందు ఎస్బీఐ ఈ వివరాలను బహిరంగపరిచేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ప్రశ్నించారు. 'వారి అవినీతిని దాచేందుకు దేశంలోని ప్రతి స్వతంత్ర సంస్థ 'మోదానీ' ఫ్యామిలీలో భాగంగా మారింది' అని రాహుల్ ఆరోపించారు. మరోవైపు ఎస్బీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించడం అనుమానాలను పెంచుతున్నదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. ఎస్బీఐ చర్య న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. 'క్విడ్ ప్రోకో' బయటపడకుండా ప్రధాని మోదీ, బీజేపీని కాపాడేందుకే ఎస్బీఐ లోక్‌సభ ఎన్నికల తర్వాతి వరకు గడువు కోరిందని ఆరోపించారు. నేటి డిజిటల్ కాలంలో సమాచారం అంతా 'మౌస్ క్లిక్' దూరంలో ఉంటుందని, అయితే ఎలక్టోరల్ బాండ్ల వివరాల సమర్పణకు గడువు పొడిగింపు కోరడం అనుమానాలకు తావిస్తున్నదని ఏచూరి అన్నారు.

# కర్ణాటకలో విద్యార్థినులపై యాసిడ్ దాడి

- ఓ బాలికకు ముఖంపై తీవ్ర గాయాలు
- ప్రేమ వ్యవహారమే కారణం!

మంగళూరు: కర్ణాటకలో దారుణం జరిగింది. ముగ్గురు విద్యార్థినులపై ఒక యువకుడు యాసిడ్ దాడి చేశాడు. ఈ ఘటనలో ఒకరికి ముఖంపై తీవ్ర కాలిన గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దక్షిణ కన్నడ జిల్లా కడబలోని ఒక ప్రీ యూనివర్సిటీ కాలేజీలో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు 23 ఏండ్ల అబిన్ షిబి అనే యువకుడిని అరెస్టు చేశారు. నిందితుడు కేరళలోని మలప్పురం జిల్లా నిలంబూర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. బాధిత యువతుల వయసు 17-19 మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఒకరిని తాను ప్రేమిస్తున్నానని, ఆమె తనతో శృంగానికి ఒప్పుకోకపోవడంతోనే తాను ఈ దారుణానికి పాల్పడినట్టు నిందితుడు పోలీసుల విచారణలో వెల్లడించాడు. అయితే తాను ఒకరిని లక్ష్యంగానే యాసిడ్ దాడి చేశానని, ఆమె పక్కన కూర్చున్న ఇద్దరిపై కూడా అది పడిందని అతను పేర్కొన్నాడు. నిందితుడు టార్గెట్ చేసిన బాలికకు ముఖంపై తీవ్ర కాలిన గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయని, చికిత్స నిమిత్తం బాధితులను వెంటనే దవాఖానకు తరలించినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. నిందితుడు తన సొంత పట్టణంలో ఎంబీఏ చదువుతున్నాడని, అతను టార్గెట్ చేసిన విద్యార్థిని కూడా కేరళ చెందిన వ్యక్తేనని, చదువు నిమిత్తం కర్ణాటకకు వచ్చిందని పోలీసులు వెల్లడించారు.

# స్టేజ్ ఆర్టిస్ట్‌పై గ్యాంగ్‌రేప్

## జార్ఖండ్‌లో మరో ఘోరం

మేదినీ నగర్: జార్ఖండ్‌లో ఇటీవల విదేశీ పర్యాటకులపై సామూహిక లైంగిక దాడి ఘటనను మరువక ముందే మరో దారుణ ఘటన ఆ రాష్ట్రంలో చోటుచేసుకున్నది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కళాకారిణి (21)పై ఆమెతోపాటు ప్రదర్శన ఇచ్చేందుకు వచ్చిన కళాకారులు సామూహిక లైంగికదాడికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. రాంచీకి 200 కిలోమీటర్ల దూరంలో శనివారం ఈ దారుణం జరిగినట్టు చెప్పారు. జార్ఖండ్‌లోని పాలము జిల్లాలోని విశ్రామ్‌పూర్‌లో ఓ ప్రదర్శన ఇచ్చేందుకు ఆమె వచ్చారు. ఆ కార్యక్రమం అనుకోకుండా రద్దవడంతో, హుస్సేనాబాద్‌లో మరొక ప్రోగ్రామ్ కోసం తన సహ కళాకారులు ముగ్గురితో కలిసి కారులో వెళ్తున్నారు. మార్గమధ్యంలో వారు ఆమెకు మత్తు పదార్థం ఇచ్చి, లైంగికదాడికి పాల్పడ్డారు. స్పృహ కోల్పోయిన ఆమెను రోడ్డు పక్కన పడేసి, పారిపోయారు. ఈ సంఘటన గురించి పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు.



## నిక్కీ హేలీకి తొలి విజయం

వాషింగ్టన్: అమెరికాలో రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిత్వం ఆశిస్తున్న భారత సంతతికి చెందిన నిక్కీ హేలీకి తొలి విజయం లభించింది. వాషింగ్టన్ డీసీ ప్రైమరీ ఎన్నికల్లో తన ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై ఆమె గెలుపొందారు. దీంతో వరుస విజయాలతో దూసుకుపోతున్న ట్రంప్‌కు బ్రేక్ పడినట్లయింది. అలాగే కీలకమైన సూపర్ ట్యూస్‌డే పోటీకి ముందు హేలీకి గొప్ప ఊతం లభించింది. రిపబ్లికన్ ప్రెసిడెన్షియల్ ప్రైమరీని గెలుచుకున్న తొలి మహిళగా హేలీ రికార్డు సృష్టించారు. అదేవిధంగా డెమొక్రాటిక్ లేదా రిపబ్లికన్ ప్రైమరీని గెలుచుకున్న తొలి ఇండియన్-అమెరికన్‌గా కూడా ఆమె నిలిచారు.



## ట్రంప్ పోటీకి మార్గం సుగమం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశ సుప్రీంకోర్టులో భారీ విజయం దక్కింది. 2020లో అమెరికా క్యాపిటల్ భవనం వద్ద జరిగిన అల్లర్లకు ఆయనను బాధ్యుడిని చేస్తూ రిపబ్లికన్ ప్రైమరీ బ్యాలెట్ నుంచి ఆయన పేరును తొలగిస్తూ కొలరాడో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. మొదట కాంగ్రెస్ చర్య తీసుకోకుండా, అంతర్యుద్ధం తర్వాతి కాలంనాటి రాజ్యాంగ నిబంధనను రాష్ట్రాలు ప్రయోగించి, ప్రెసిడెన్షియల్ క్యాండిడేట్స్‌ను ఎన్నికలకు దూరంగా ఉంచలేవని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీంతో కొలరాడో, ఇలినాయిస్, మైనే వంటి చోట్ల ట్రంప్‌నకు వ్యతిరేకంగా పిటిషనర్లు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రిపబ్లికన్ పార్టీ తరపున దేశాధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ట్రంప్ ముందంజలో ఉన్న విషయం తెలిసిందే.

# గోదాముల నిల్వలపై రైతులకు రుణాలు

## డిజిటల్ ప్లాట్‌ఫాం ప్రారంభించిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 4: రిజిస్టర్డ్ గోడౌన్లలో రైతులు నిల్వ చేసుకున్న తమ ఉత్పత్తులపై రుణాలు పొందేందుకు వీలుగా డిజిటల్ ప్లాట్‌ఫాంను కేంద్ర ఆహారా, వినియోగదారుల వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ప్రారంభించారు. అలాగే వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (డబ్ల్యుడీఆర్‌ఏ) త్వరలో వేర్‌హౌస్ యజమాని చెల్లించే సెక్యూరిటీ డిపాజిట్‌ను ప్రస్తుతమున్న 3 శాతం నుంచి 1 శాతానికి తగ్గించనున్నట్టు మంత్రి ప్రకటించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి గోయల్ ' ఈ-కిసాన్, ఉపాజ్ నిధి' పేరుతో డిజిటల్ గేట్‌వేని ప్రారంభించారు. ఇది డబ్ల్యుడీఆర్‌ఏ కింద నమోదైన గిడ్డంగుల్లో రైతులు నిల్వ చేసిన సరుకుపై బ్యాంకుల నుంచి రుణాలు పొందటానికి సులభమైన మార్గంగా రూపొందనున్నది. ప్రస్తుతం డబ్ల్యూడీఆర్‌ఏ కింద 5,500 కంటే ఎక్కువ గిడ్డంగులు నమోదై ఉన్నాయి. మొత్తం వ్యవసాయ గిడ్డంగుల సంఖ్య లక్ష వరకు ఉంటుందని అంచనా. రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం ద్వారా భారతీయ వ్యవసాయాన్ని ఆధునీకరించాల్సిన అవసరమున్నదని మంత్రి నొక్కి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన గేట్‌వేతో రైతులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా 7 శాతం వడ్డీతో రుణాలు సులభంగా లభిస్తాయని మంత్రి వెల్లడించారు. రైతులు గోదాముల్లో నిల్వ ఉంచిన ఉత్పత్తులను సరైన సమయంలో అమ్ముకోవచ్చని, ఇకపై నష్టాల్లో పంటలను అమ్ముకోవాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.



# మణిపూర్‌లో ప్రాంతాల పేర్లను మార్చితే మూడేండ్ల జైలు



న్యూఢిల్లీ: గ్రామాలు, పట్టణాల పేర్లను అనధికారికంగా మార్చడంపై నిషేధం విధిస్తూ మణిపూర్ శాసనసభ ఓ బిల్లును సోమవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రదేశాల అధికారిక పేర్లను ప్రభుత్వ అనుమతి లేకుండా మార్చే వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల వరకు జరిమానా విధించేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తున్నది. మైతీలు, కుకీ-జో తెగల మధ్య ప్రస్తుతం ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఒక తెగ ప్రజలు ఎక్కువగా నివసించే ప్రదేశాల అధికారిక పేర్లను మార్చేందుకు మరొక తెగ ప్రయత్నిస్తున్నదని, ఈ విధంగా అనధికారికంగా పేర్లను మార్చడం వల్ల అధికారుల విధి నిర్వహణకు సమస్యలు ఎదురవుతాయని, సామాజిక సామరస్యం దెబ్బతింటుందని ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ చెప్పారు.

# అబార్షన్ రాజ్యాంగ హక్కు

## చారిత్రక బిల్లుకు ఫ్రాన్స్ పార్లమెంట్ ఆమోదం

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంట్ సోమవారం చారిత్రక బిల్లును ఆమోదించింది. అబార్షన్ హక్కును రాజ్యాంగంలో చేర్చింది. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించింది. సోమవారం జరిగిన ఉభయ సభల సమావేశంలో దీనిపై ఓటింగ్ నిర్వహించగా.. 780-72 ఓట్లతో బిల్లుకు ఆమోదం లభించింది. దీంతో అబార్షన్ హక్కును రాజ్యాంగంలో చేర్చిన తొలి దేశంగా ఫ్రాన్స్ నిలిచింది. పార్లమెంట్ ఆమోదం నేపథ్యంలో మహిళా హక్కుల కార్యకర్తలు దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు.

# 'న్యూస్ ప్రింట్‌పై కస్టమ్స్ డ్యూటీ ఉపసంహరించాలి'

న్యూఢిల్లీ: న్యూస్‌ప్రింట్‌పై వసూలు చేస్తున్న 5 శాతం కస్టమ్స్ సుంకాన్ని ఉపసంహరించాలని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) సోమవారం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ సుంకాన్ని ఉపసంహరిస్తే, ప్రింట్ మీడియాకు ఎంతో ఉపశమనం దొరుకుతుందని, అంతేకాకుండా, ప్రజలకు విశ్వసనీయమైన వార్తలను అందజేసేందుకు దోహదపడుతుందని తెలిపింది. రూపాయి విలువ క్షీణించడం, పశ్చిమాసియా ఘర్షణలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఎర్ర సముద్రంలో సరుకు రవాణా నౌకలపై దాడులు వంటి వాటివల్ల ధరలు పెరుగుతున్నాయని పేర్కొన్నది.

